ఆకాశంలో మబ్బులు.. రైతుల పరుగులు


రామడుగులో ధాన్యం కుప్పగా చేస్తున్న రైతులు


శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

శంకరపట్నం/రామడుగు: ఉరుములు మెరుపులు, ఆకాశంలో మబ్బులు ఒక్కసారి కమ్ముకోవడంతో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా చేశారు. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. కొత్తగా వేసిన రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోశారు. శుక్రవారం ఒక్కసారి మబ్బులు కమ్ముకోడవంతో ఆరుగాలం శ్రమించి పండించిన వడ్లు తడిసిపోతా యని పరుగు పరుగున వెళ్లి కుప్పలు చేసి కవర్లు కప్పారు. ఉదయం నుంచి నిప్పులు కుమ్మరించిన సూర్యుడిని సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మేయడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. రామడుగు మండలంలోని ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తేమ ఎక్కువగా ఉందని ధాన్యం ఆరబోశారు. వాతావరణం చల్లబడటంతో వర్షం కురుస్తుందేమోనని ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా చేసేందుకు పరుగులు తీశారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పారు, మబ్బులు తొలిగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నిర్మించినా నిరుపయోగమే



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామంలో వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ పాఠశాల ఆవరణలో మరోటి నిర్మించారు. పైప్‌లైన్ పనులు సైతం పూర్తి చేశారు. కానీ ట్రయల్ రన్‌లో లోపాలు తలెత్తి కొత్తగా వేసిన పైపులు పగిలిపోవడంతోపాటు లీకేజీలయ్యాయి. దీంతో 2021 మే, జూన్, జూలైలో కేవలం ఐదుసార్లు ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించారు. పాత ట్యాంక్‌లోకి బోరు బావి, మిషన్ భగరీథ నీటిని నింపి గ్రామానికి సరాఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

క్లుప్తంగా

నియామకం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన వెన్న రాజమల్లయ్యను కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఎస్సీ విభాగం ఎన్నికల పరిశీలకుడిగా నియామకం చేస్తూ టీపీసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రాజమల్లయ్య మాట్లాడుతూ... కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పని చేయడంతో పాటుగా ఎస్సీలకు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తానని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ నాగరిగారి ప్రీతంకు కృతజ్ఞతలు తెలియజేశాడు.

ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, ప్రజా సంఘాల నాయకుడు అందె వెంకటేశ్వర్‌రావును ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినయ్ కుమార్, మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. కాగా నియామకానికి సహకరించిన వినయ్ కుమార్, మధు, మహేశ్, కాల్వల రామచందర్, సతీశ్‌కు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ


వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో టౌన్ సీఐ రవి కేంద్ర బలగాలతో శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. త్రిబుల్ రైడింగ్, సరైన పత్రాలు లేని, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు నడపాలి



గన్నేరువరం: కరీంనగర్ నుంచి వయా గుండ్లపల్లి మీదుగా గన్నేరువరం వరకు ఆర్టీసీ బస్సు నడపాలని టీటీడీపీ మండల అధ్యక్షుడు గుండా పర్శరాంగౌడ్ ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మండలంలోని గుండ్లపల్లిలో శుక్రవారం మాట్లాడారు. మండలం ఏర్పాటు కాకముందు నుంచే ఆర్టీసీ బస్సు వచ్చేదని, ఈ రూట్లో బస్సు సౌకర్యం లేకపోవడంతో గునుకులకొండాపూర్, గుండ్లపల్లి, చీమలకుంటపల్లి, జంగపల్లి, గోపాల్‌పూర్, పీచుపల్లి, హన్మాజిపల్లె, మాదాపూర్ గ్రామాల ప్రజల కరీంనగర్, మండలకేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ కె. శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రెయిన్ ఓ విజన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మొబైల్ ఇంటర్ ఫేస్ టెక్నాలజీపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రసాంకేతిక రంగంలో రోజురోజూకు వస్తున్న మార్పులను విద్యార్థులు గమనించాలని, సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొబైల్ అప్లికేషన్ రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయని, కొత్త సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ కె. రవీంద్రబాబు, సమన్వయకర్తలు పవన్, రఘు, భాస్కర్, ప్రకాశ్, రఘుపతి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మొత్తం మాఫీ కాలే!

- స్వశక్తి సంఘాలకు నాలుగు నెలల వడ్డీ మాఫీ డబ్బులు చెల్లింపు
- త్వరలో ఖాతాల్లో జమ
- పూర్తిస్థాయిలో ఎప్పుడవుతుందో అంటున్న మహిళలు


మానకొండూర్‌లో మహిళా సంఘం సభ్యుల సమావేశం(ఫైల్)

మానకొండూర్: స్వశక్తి సంఘాల్లోని మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలకు ప్రతినెల నెల వడ్డీ చెల్లించలేక మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తీసుకున్న రుణాలకు మూడు, నాలుగేళ్లుగా వడ్డీ చెల్లించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నాలుగు నెలలకు వడ్డీ మాఫీ కింద డబ్బులు చెల్లించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ తీసుకున్న రుణాలకు పూర్తి స్థాయిలో వడ్డీ మాఫీ ఎప్పుడు అవుతుందోనని ఎదురు చూస్తున్నారు.

వడ్డీ చెల్లించలేక ఇబ్బందులు

కుటుంబ అవసరాల కోసం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు రుణాలు తీసుకొని కూలీ పనులు చేస్తూ క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తూ వచ్చారు. డబ్బులు కట్టకపోతే గ్రూపు సభ్యులతో సూటిపోటీ మాటలు ఉంటాయని బావించిన మహిళలు ఇంట్లో ఎన్ని ఇబ్బందులు ఉన్నా కొంత అసలుతో పాటు వడ్డీ చెల్లించారు. తాము సంపాదించింది వడ్డీలకే చెల్లిస్తున్నామని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మాత్రం వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదని, వడ్డీ మాఫీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.ఐదు లక్షలకే పరిమితం...

ఒక మహిళ సంఘంలోని సభ్యులు అందరూ రూ. పదిలక్షలు రుణం తీసుకుంటే కేవలం రూ. ఐదులక్షల వరకూ వడ్డీ లేని రుణం అందుతంది. ప్రధానంగా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలకే ఇది వర్తిస్తుంది. మానకొండూర్ మండలంలో 54 వీవోలు, 1327 సంఘాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న 1,171 మహిళా సంఘాలకు వడ్డీ మాఫీ వర్తింపజేసింది. రూ. 1.16 కోట్లు వడ్డీ మాఫీ కింద సంఘాలకు చెల్లించింది. రుణం తీసుకున్న మహిళలకు త్వరలోనే ఈ డబ్బులు అందుతాయని అధికారులు చెబుతున్నారు. కాగా ఐదు లక్షల వరకే వడ్డీ మాఫీ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే నాలుగు నెలలు వడ్డీమాఫీ డబ్బులు మాత్రమే చెల్లించింది. వడ్డీ మాఫీ వచ్చిందని మహిళలు ఓ వైపు సంతోషం వ్యక్తం చేస్తున్నా మరో వైపు పూర్తి స్థాయిలో మాఫీ కాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2020 ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ వరకూ మాఫీ వర్తించలేదని వాపోతున్నారు.

ఖాతాల్లో డబ్బు జమ చేస్తాం

బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకున్న మహిళా సంఘాలకు నాలుగు నెలల వడ్డీ మాఫీ డబ్బులు వచ్చాయి. రుణాలు తీసుకున్న మహిళల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తాం. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించిన 1,171 సంఘాలకు మాఫీ వర్తించింది.

– నిరంజన్, ఏపీఎం

'హామీలు అమలు చేయకుంటే బీఆర్ఎస్ గతే'


మాట్లాడుతున్న వెంకటస్వామి, తదితరులు

శంకరపట్నం: ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు పాతాళంలోకి తొక్కేస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ నియంతృత్వ పాలనతో విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే బీఆర్ఎస్ గతే పడుతోందని హెచ్చరించారు. కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులు కుంగిపోతే ఉన్న నీటిని గోదావరిలోకి వదిలారని ఆ నీటిని మళ్లించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మళ్లీ ఆ నాయకులే అందలం ఎక్కుతున్నారని, కొత్త సీసాలో పాత సారా నింపినట్లుగా కాంగ్రెస్ పార్టీ తయారైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామనే మితిమీరిన విశ్వాసంతో కాకుండా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం హిందు రాజ్యాంగంగా మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, రవి, సదానందం, బాదుల్లా, మొగిలి, కాసిం, నాగూర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలో ఉపజ్ఞ హోమ్స్ వెంచర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారులు విచారణ చేపట్టారు. గతంలో నిర్మాణాలపై సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం డీఎల్పీవో రాంబాబు విచారణ చేశారు. పార్క్ ప్లేసులో డూప్లెక్స్ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోని పార్కింగ్ స్థలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. సమగ్ర విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్పీవో తెలిపారు. వెంట ఎంపీవో కిరణ్, సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు, బాధితులు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు


గన్నేరువరం: జంగపల్లిలో శుక్రవారం సభ


చిగురుమామిడిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

రామడుగు: మండలంలోని వెలిచాల అంగన్‌వాడీ కేంద్రం–2లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీడబ్ల్యువో సరస్వతి మాట్లాడుతూ.. జంక్‌ఫుడ్ తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తినకుండా ఉంటే మంచిదని చెప్పారు. గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని, నిత్యం యోగా చేస్తే సాధారణ డెలివరీ అయ్యే అవకాశం ఉంటుందని, పిల్లలు వయస్సుకు తగిన ఎత్తు, బరువులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ సుధారాణి, సఖీ సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మీ, వైద్యాధికారి, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లులతో పాటుగా పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి, గన్నేరువరం మూడో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభా నిర్వహించారు. పిల్లల ఎదుగుదల, అనుబంధ పోషకాహారం, మహిళలు, పిల్లల సమస్యలు, యోగా వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. అలాగే వార్షికోత్సవలు నిర్వహించారు. పిల్లలతో ఆట, పాటలు పాడించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న మెనును వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాధ, అంగన్‌వాడీ టీచర్లు అటికం శారధ, సరోజన, ఆశ వర్కర్ పుష్పలత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రక్తహీనత తో బాధపడే పిల్లలకు ఐరన్ పదార్థాలు, మాత్రలను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర కోరారు. చిగురుమామిడిలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మండలస్థాయి సభానిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రతి శుక్రవారం ఏదో ఒక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలు, తల్లులు, బాలింతల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే పోషకాహారంతో చిన్నపిల్లల ఎదుగుదలను తూకం వేసి పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం అందించే ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. మహిళల్లో వచ్చే నెలసరి సమస్యలపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తగిన పరీక్షల చేసుకుని మందులు వాడాలని కోరారు. ఐకేపీ సీసీ సత్యనారాయణ, అరుణ, ఇందిర, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో పిచ్చాస్పత్రి ఏర్పాటు చేయించండి


బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు

కరీంనగర్‌టౌన్: హుస్నాబాద్‌లో పిచ్చాసుపత్రిని ఏర్పాటు చేయించాలని హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కోరారు. శుక్రవారం కరీంనగర్‌లో బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి హుస్నాబాద్ నియోజకవర్గం సహా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ పిచ్చిపిచ్చి చేష్టలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సొంత పార్టీ నేతలు కూడా పొన్నం ప్రభాకర్ వద్దకు వెళ్లాలంటనే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. పొన్నం ప్రభాకర్ తీరును చూస్తుంటే ఆయనకు మతి స్థిమితం కోల్పోయినట్లుందని, ఆయన మెప్పు పొందేందుకు మరికొందరు కాంగ్రెస్ నాయకులు కూడా ఇదే తీరులో వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి వారికి మానసిక చికిత్స అవసరమని భావిస్తున్నటు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా సమీపంలో ఎక్కడా మెంటల్ ఆసుపత్రి లేనందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెంటల్ ఆసుపత్రిని ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని వినతిలో పేర్కొన్నారు.

నేత్రదానం

చొప్పదండి: పట్టణ కేంద్రానికి చెందిన గుండేటి లక్ష్మి (73) శుక్రవారం మృతి చెందగా చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు టెక్నీషియన్ ద్వారా ఆమె నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కొల్లూరి జితేందర్, కోశాధికారి రాజేశ్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు.

న్యూ మిలీనియం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

కరీంనగర్: పదో తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే గతేడాది ఫలితాలతో హోర్డింగ్‌లు పెట్టి ప్రచారం చేస్తున్న న్యూమిలీనియం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంధ గణేశ్ మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న జమ్మికుంటలోని న్యూ మిలియన్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాయి, తిరుపతి, కుమార్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జమ్మికుంట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ కౌన్సిలర్, శాతవాహన యూనివర్సిటీ మాజీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, జిల్లా గ్రంథాలయ మాజీ డైరెక్టర్ కొడిగూడి మొగిలయ్య రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, నాయకులు పొనగంటి మల్లయ్య, దేశిని కోటి, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 24వ వార్డులకు చెందిన బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ప్రణవ్ పార్టీ కుండవాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సందమల్ల నరేశ్, బాబు, బత్తిని రవీందర్, కిరణ్, బాబు, దుబాసి బాబు ఉన్నారు.

క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: చొప్పదండిలోని క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం గృహప్రవేశం చేశారు. సతీసమేతంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్యాంపు కార్యాలయంలోకి అడుగు పెట్టారు. అనంతరం వివిధ పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపు కార్యాలయం కేంద్రంగా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని, మధ్యవర్తిత్వం లేకుండా ప్రజలు నేరుగా కలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

22న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఒగ్గుపూజారులు

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో 22న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జక్కుల బాబు తెలిపారు. చిగురుమామిడిలో శుక్రవారం మాట్లాడారు. 20 నుంచి ప్రత్యేక కార్యక్రమాలుంటాయన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అన్నదానం, అదే రోజు సాయంత్రం పోచమ్మతల్లి బోనాలు, తర్వాత రోజు ఉదయం పెద్దమ్మ తల్లి బోనాలు, 24న జాతర నిర్వహిస్తామన్నారు. ఐదు గుంటల స్థలంలో దాదాపు రూ. నలభై లక్షలతో ఆలయాన్ని అన్ని హంగులతో నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్, కార్యదర్శి మల్లేశం, స్వామి, సమ్మయ్య, వెంకటయ్య, రాజయ్య, చంద్రమౌళి, పర్శరాములు, కనకయ్య, వెంకటేశ్వర్లు, నందు, ఆంజనేయులు, జక్కుల మహేశ్, రమేశ్, వెంకట్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ చేయాలి


కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న నాయకులు

చిగురుమామిడి: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, తక్షణం రెండు లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని సీతారాంపూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో 42 కిలోలు తూకం వేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి 40 కిలోలు మాత్రమే తూకం వేయాలని ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోకుండా రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామంలోని ఈజీఎస్ కూలీలవద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో వేతనాలు విడుదల చేసి కూలీలను ఆదుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భేతి రాజిరెడ్డి, నాయకులు మంకాలి కొంరయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్యామకూర సంపత్‌రెడ్డి, నాయకులు గోగూరి కృష్ణారెడ్డి, ముస్కుల కిష్టారెడ్డి, బుద్ది సంతోష్ నాయకులున్నారు.